# మొక్కల పెంపకం విప్లవంలా చేపట్టాలి

**హరితోత్సవంలో జడ్పీ చైర్‌పర్సన్ రోజాశర్మ పిలుపు**



గజ్వేల్ అర్బన్ పార్కులో హరితోత్సవానికి హాజరైన విద్యార్థులు



సమావేశంలో మాట్లాడుతున్న జడ్పీ చైర్‌పర్సన్ రోజాశర్మ

గజ్వేల్, జూన్ 19: హరితహారంలో ప్రతి ఒక్కరూ మొక్కల పెంపకాన్ని విప్లవంలా చేపట్టాలని, సీఎం కేసీఆర్ చేపట్టిన మహాయజ్ఞంలో అందరూ పాల్గొని విజయవంతం చేయడంతోనే నేడు ఆకు పచ్చని తెలంగాణగా మారిందని జడ్పీ చైర్‌పర్సన్ రోజాశర్మ, ఎమ్మెల్సీ యాదవరెడ్డి అన్నారు. దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా సోమవారం గజ్వేల్ అర్బన్ పార్కులో మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో అతిథులు మాట్లాడారు. రాష్ట్రవ్యాప్తంగా పండుగలా తొమ్మిదేండ్ల పాటు హరితహారంలో పాల్గొని అన్ని వర్గాల వారు మొక్కలు నాటారన్నారు. ముందు తరాలకు తెలిసేలా ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి పర్యావరణాన్ని పరిరక్షించుకోవాల్సి బాధ్యత మనదేనన్నారు. ప్రకృతిలో మొక్కల పెంపకం చాలా ముఖ్యమైందని, అందుకు ప్రతి విద్యార్థీ ఏడాదికి ఒకటి చొప్పున మొక్కలను నాటాలన్నారు. పాఠ్య పుస్తకాల్లో చదువుకున్న విధంగా మొక్కల ప్రాముఖ్యతను కుటుంబ సభ్యులకు తెలియజేయాలని అప్పుడే ప్రతి ఒక్కరికీ మొక్కల ప్రయోజనాలు తెలుస్తాయన్నారు. పర్యావరణం కలుషితం కాకుండా ఉండాలంటే ప్రతి ఇంటి ఆవరణలో మొక్కలు పెంచాలన్నారు. ఆక్సిజన్ ప్రాధాన్యత ఎంతో ముఖ్యమైందని జీవకోటి మనుగడకు ఆక్సిజన్ చాలా అవసరమన్నారు. సీఎం కేసీఆర్ పెద్ద ఎత్తున మొక్కల పెంపకానికి ప్రాధాన్యతను కల్పించడంతో గ్రామాలు పచ్చని తోరణంలా కనిపిస్తున్నాయని, గ్రామానికో పల్లె ప్రకృతివనం ఏర్పాటు చేసి అందులో అన్ని రకాల మొక్కలు పెట్టుకునేలా ప్రభుత్వం కృషి చేసిందన్నారు. వర్షాలు పడగానే ఖాళీ ప్రదేశాల్లో మొక్కలు నాటే ప్రక్రియను చేపట్టాలన్నారు. అంతకుముందు గజ్వేల్ పట్టణంలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఆర్డీవో విజయేందర్‌రెడ్డి, అటవీ రేంజ్ ఆఫీసర్ కిరణ్‌కుమార్, మున్సిపల్ చైర్మన్ రాజమౌళి, ఏఎంసీ చైర్మన్ మాదాసు శ్రీనివాస్, జడ్పీటీసీ మల్లేశం, ఆత్మ కమిటీ చైర్మన్ కృష్ణారెడ్డి, వైస్ చైర్మన్ జకీయొద్దీన్, సెక్షన్ అధికారులు అర్జున్ రావు, షెకావత్, ఆసిమ్, బీట్ అధికారులు వెంకటేశ్, ప్రసాద్, నాయకులు రాజిరెడ్డి, పంబాల శివకుమార్, గంగిశెట్టి రవీందర్, రమేశ్‌గౌడ్, శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ఎప్పటికీ నిలిచిపోయే గొప్ప ఆస్తి వృక్షాలు

- జిల్లాలో 6.4 నుంచి 14 శాతానికి పెరిగిన గ్రీన్ కవర్
- కలెక్టర్ ప్రశాంత్ జీవన్ పాటిల్

సిద్దిపేట అర్బన్, జూన్ 19: ఎప్పటికీ నిలిచిపోయే గొప్ప ఆస్తి వృక్షాలని జిల్లా కలెక్టర్ ప్రశాంత్ జీవన్ పాటిల్ అన్నారు. తెలంగాణ రాష్ట్ర దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా అటవీ శాఖ ఆధ్వర్యంలో సిద్దిపేట ఆక్సిజన్ పార్క్‌లో సోమవారం హరితోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ విద్యార్థులతో కలిసి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. తెలంగాణకు హరితహారం ద్వారా జిల్లాలో వన సంపద పెరిగిందన్నారు. 9 ఏండ్లలో సీఎం కేసీఆర్, మంత్రి హరీశ్‌రావు మార్గదర్శకత్వంలో సిద్దిపేట జిల్లాలో 7 కోట్ల 28 లక్షల మొక్కలు నాటి సంరక్షించామన్నారు. తద్వారా జిల్లాలో గ్రీన్ కవర్ 6.4 శాతం నుంచి 14 శాతానికి పెరిగిందన్నారు. పచ్చదనం పెరగడంతో ప్రజలకు, పశుపక్ష్యాదులకు మంచి గాలి, ఆహ్లాదకరమైన వాతావరణం లభిస్తుందన్నారు. చెట్లు ఎక్కువ ఉంటే వాటి ఆకుల నుంచి నీరు భాష్పీభవనం ద్వారా ఆకాశంలోకి వెళ్లి మేఘాలను ఆకర్షించి వర్షాలు కురుస్తాయన్నారు. ఇలా ఒక సైకిల్ పద్ధతిలో మొక్కలు ఉంటే అధిక వర్షాలు కురుస్తాయన్నారు. పాఠశాల విద్యార్థులు ప్రతి ఒక్కరూ ఒక్కో మొక్కను నాటి దత్తత తీసుకొని పెంచాలన్నారు. ఒక మొక్క పెరిగి వృక్షంగా పెరగడానికి 10 సంవత్సరాల సమయం పడుతుందని, మొక్కలను ఎట్టి పరిస్థితుల్లో నరకరాదన్నారు. కార్యక్రమంలో జిల్లా అటవీ శాఖ అధికారి శ్రీనివాస్, మర్పడగ ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు.



సిద్దిపేట అర్బన్ పార్కులో మొక్కు నాటుతున్న కలెక్టర్ ప్రశాంత్ జీవన్ పాటిల్, ఇతర అధికారులు



సీఏఆర్ క్వార్టర్స్ ఆవరణలో మొక్క నాటి నీళ్లు పోస్తున్న సీపీ శ్వేత, పోలీసు అధికారులు

## పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత: సీపీ శ్వేత

సిద్దిపేట అర్బన్, జూన్ 19: పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని భావి తరాల భవిష్యత్‌ను దృష్టిలో పెట్టుకొని మొక్కలు నాటడం అలవాటు చేసుకోవాలని సిద్దిపేట పోలీస్ కమిషనర్ ఎన్.శ్వేత సూచించారు. సిద్దిపేట పట్టణ శివారులోని సీఏఆర్ హెడ్ క్వార్టర్స్‌లో తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా సోమవారం హరితోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీపీ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా శ్వేత మాట్లాడుతూ.. తమ పుట్టిన రోజు, వివాహ వార్షికోత్సవం రోజు మొక్కలు నాటడం, మొక్కలను బహుమతిగా అందజేయడం ఒక ఆనవాయితీగా మార్చుకోవాలని తెలిపారు. రాబోయే తరాలకు స్వచ్ఛమైన ఆక్సిజన్ అందించాలనే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం హరితహారం చేపట్టిందని సీపీ తెలిపారు. ఏఆర్ అడిషనల్ డీసీపీలు సుభాష్ చంద్రబోస్, రామచంద్ర రావు, రిజర్వ్ ఇన్‌స్పెక్టర్లు శ్రీధర్‌రెడ్డి, రామకృష్ణ, ధరణికుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

# హరిత తెలంగాణే సీఎం కేసీఆర్ లక్ష్యం

- ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి

చేర్యాల, జూన్ 19 : బీడువారిన తెలంగాణ రాష్ట్రాన్ని హరితవనంగా మార్చడమే సీఎం కేసీఆర్ లక్ష్యమని, దానికి అనుగుణంగా రాష్ట్ర ఏర్పాటు నుంచి హరితహారం కార్యక్రమం విజయవంతంగా కొనసాగుతున్నదని ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి తెలిపారు. దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా చేర్యాల మండలం ముస్త్యాల గ్రామంలో సోమవారం హరితోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా పల్లె ప్రకృతి వనంతోపాటు రోడ్డుకు ఇరువైపులా, ఇతర ప్రాంతాల్లో నాటిన మొక్కలకు ఎమ్మెల్యే పాదులు తీయించారు. ముళ్లకంపతో కంచె ఏర్పాటు చేయించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. నాటిన ప్రతి మొక్కను కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. సీఎం కేసీఆర్ ప్రత్యేక శ్రద్ధ కార్యాచరణతో తెలంగాణ రాష్ట్రంలో మొక్కలు విరివిగా నాటడడంతో మంచి ఫలితాలు ఇస్తున్నాయన్నారు. రానున్న రోజుల్లో మరిన్ని మొక్కలు నాటాల్సిన అవసరం ఉందన్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు, యువజన సంఘాలతోపాటు బీఆర్ఎస్, అనుబంధ సంఘాల నాయకులు, కార్యకర్తలు గ్రామాల్లో నాటిన మొక్కలను రక్షించేందుకు నిత్యం కృషి చేయాలన్నారు. ప్రతిపక్ష పార్టీలు అధికారం కోసం తెగ కష్టపడుతున్నారని విమర్శించారు. ప్రజలు అధికారం ఇచ్చినప్పుడు మంచి చేయని వారు ఒక్కసారి అవకాశం ఇవ్వండి అది చేస్తాం.. ఇది చేస్తామని చెప్పడం విడ్డూరంగా ఉందంటూ ఎద్దేవా చేశారు. ప్రతిపక్ష పార్టీలను నమ్మి వారికి అధికారం అప్పగిస్తే తెలంగాణ ఏడారిగా మారుస్తారని తూర్పారబట్టారు. ప్రజలు తిరిగి బొంబాయి, బొగ్గుబాయి, దుబాయికి వెళ్లేలా పాలన సాగిస్తారని దుయ్యబట్టారు. ప్రతి ఇంటా సౌభాగ్యం వెల్లివిరియాలంటే సీఎం కేసీఆర్‌కు అండగా ఉండాలని, ఆయన పార్టీని ఆదరించాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ పెడుతల ఎల్లారెడ్డి, ఉప సర్పంచ్, వార్డు సభ్యులు, అధికారులు, కార్యదర్శి, సిబ్బంది పాల్గొన్నారు.



ముస్త్యాలలో మొక్కకు కంచె ఏర్పాటు చేయిస్తున్న ఎమ్మెల్యే యాదగిరిరెడ్డి

# ప్రజావాణి ఫిర్యాదులు త్వరగా పరిష్కరించాలి

**అదనపు కలెక్టర్ ముజామ్మిల్**



ప్రజావాణిలో ఫిర్యాదులను స్వీకరిస్తున్న అదనపు కలెక్టర్ ముజామ్మిల్‌ఖాన్

సిద్దిపేట అర్బన్, జూన్ 19: జిల్లాలోని ఉన్నతాధికారులు నేరుగా ప్రజా సమస్యలు విని పరిష్కరించడానికే ప్రజావాణి కార్యక్రమాన్ని ప్రభుత్వం మొదలుపెట్టిందని జిల్లా అదనపు కలెక్టర్ ముజామ్మిల్‌ఖాన్ తెలిపారు. జిల్లా కలెక్టరేట్‌లో సోమవారం ఏర్పాటు చేసిన ప్రజావాణిలో అదనపు కలెక్టర్ అర్జీదారుల నుంచి ఫిర్యాదులను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎంతో ఆశతో అర్జీదారులు ప్రజావాణికి వస్తారని, వారందరికీ న్యాయం చేయడం మన కర్తవ్యమని అధికారులకు సూచించారు. అర్జీదారుల నుంచి తీసుకున్న ఫిర్యాదులు త్వరగా పరిష్కరించి నివేదిక అందించాలన్నారు. భూసంబంధిత, రెండు పడక గదుల ఇండ్లు, ఆసరా పింఛన్లు, ఇతరత్రా కలిపి మొత్తం 49 దరఖాస్తులు వచ్చాయని అధికారులు తెలిపారు. కార్యక్రమంలో కలెక్టరేట్ ఏవో అబ్దుల్ రెహమాన్, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# అర్చక రథయాత్రను విజయవంతం చేయాలి

**ధూపదీప నైవేద్య అర్చకుల సంఘం జిల్లా అధ్యక్షుడు కలకుంట్ల వేంకట నరసింహాచార్య, అర్చక ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు కలకుంట్ల కృష్ణమాచార్య వెల్లడి**

సిద్దిపేట టౌన్, జూన్ 19: తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా ధూపదీప నైవేద్య అర్చక, ఉద్యోగులు ఈ నెల 21 మంత్రి హరీశ్‌రావు నేతృత్వంలో సిద్దిపేట వేంకటేశ్వర స్వామి ఆలయం నుంచి అర్చక రథయాత్ర చేపట్టనున్నామని ధూపదీప నైవేద్య అర్చక జిల్లా అధ్యక్షుడు కలకుంట్ల వేంకట నరసింహాచార్య, జిల్లా అర్చక ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు కలకుంట్ల కృష్ణమాచార్య అన్నారు. ఈ మేరకు సిద్దిపేటలో సోమవారం మీడియా సమావేశం నిర్వహించి మాట్లాడుతూ.. తెలంగాణ అర్చక జేఏసీ పిలుపు మేరకు రథయాత్రను నిర్వహిస్తున్నామన్నారు. ఆ రోజున ఉదయం అన్ని ఆలయాల్లో సీఎం కేసీఆర్, మంత్రి హరీశ్‌రావు పేరిట ప్రత్యేక పూజలు చేపట్టాలని పిలుపునిచ్చారు. అర్చక రథయాత్రలో సీఎం కేసీఆర్ అర్చకుల కోసం చేపట్టిన సంక్షేమ పథకాలను ప్రజలకు అర్థమయ్యేలా వివరించాలని కోరారు. అర్చక రథయాత్రలో పెద్ద ఎత్తున ధూపదీప అర్చకులు, ఉద్యోగులు పాల్గొనాలని కోరారు.



మీడియాతో మాట్లాడుతున్న వేంకట నరసింహాచార్య, కృష్ణమాచార్య